క్లుప్తంగా

పౌష్టికాహార ఆవశ్యకతపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, చిన్నారులు

ఏలూరు (టూటౌన్): పిల్లలకు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఆట, పాటలతో విద్యాను అందించాలని ఐసీడీఎస్ పీడీ కేవీఎల్ పద్మావతి సూచించారు. ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సెక్టార్-1 పరిధిలోని శివగోపాలపురం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమంలో పీడీ పద్మావతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం పౌష్టికాహారం ఉపయోగాలను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ బి.మంగ, అంగన్‌వాడీ కార్యకర్త ఎ.హైమ, స్థానిక మహిళలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కొఠారు పర్యటన

ఏలూరు రూరల్: ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఏలూరు రూరల్ గ్రామాల్లో బుధవారం పర్యటించనున్నారని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పేర్కొంది. ఉదయం 9 గంటలకు మల్కాపురంలో మల్టీపర్పస్ సెంటర్ ప్రారంభిస్తారని, మాదేపల్లిలో పేదలకు ఇళ్ల స్థల పట్టాలు అందజేస్తారని తెలిపింది. అనంతరం గురుకులపేటలో తమ్మిలేరుపై నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారని, శ్రీపర్రులో పట్టాల పంపిణీ, కలకుర్రులో అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని వెల్లడించింది.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయ స్వామికి పూజ చేస్తున్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేసి స్వామి వారికి ఆకుపూజ, పానకంతో విశేష అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ టీవీ విద్వాంసుడు తెనాలికి చెందిన నోరి నారాయణమూర్తి సుందర కాండ అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి బుర్రా పద్మనాభుని శర్మ పాదుక పట్టాభిషేకం అనే అంశంపై హరికథా కాలక్షేపం నిర్వహించారు.

నైతిక విలువలతో కూడిన విద్యాబోధన అందించాలి



ఫ్యాన్లు అందిస్తున్న టీచర్ మండే సుధాకర్

భీమడోలు: ఉపాధ్యాయులు పాఠశాలల్లో నైతిక విలువలతో కూడిన విద్యాబోధనను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని భీమడోలు 1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. భీమడోలు మండల విద్యా వనరుల కేంద్రానికి మంగళవారం పాతూరు టీచర్ మండే సుధాకర్ తన తల్లి దేవదానమ్మ జ్ఞాపకార్థం రెండు ఫ్యాన్లు ఎంఈవోల చేతుల మీదుగా అందించారు. పీఆర్‌టీయూ జిల్లా నాయకులు కేఎంజీ పుల్లారావు, ఎం.శరీన్, సీఆర్‌ఎంటీలు సీహెచ్ రమణ, డేవిడ్‌రాజు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

పెదపాడు : రానున్న ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని తహసీల్దార్ భావనారాయణ అన్నారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడులోని 128,130,131,132 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లు వేగవంతం చేయాలని స్థానిక రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

పేదల పార్టీ వైఎస్సార్ సీపీ

- ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు నాని
- ఘనంగా ఆవిర్భావ వేడుక



పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో ఇడా చైర్మన్ బొద్దాని

ఏలూరు టౌన్: నాడు రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీని స్థాపించి, పేదల పార్టీగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. వైఎస్సార్ సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ రాష్ట్రంలో నాడు చంద్రబాబు పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజా సంకల్ప పాదయాత్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 3,648 కిలో మీటర్లు పాదయాత్ర చేస్తూ ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్నారని గుర్తుచేశారు. ప్రజల కష్టాలను, సమస్యలను తొలగించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ఎన్నికల మేనిఫెస్టోను ప్రకటించి ప్రజల మద్దతును కోరారని తెలిపారు. ప్రజాభిమానంతో 151 సీట్లు కైవసం చేసుకుని వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన చేసి ప్రతి కార్యకర్తా, నాయకుడూ తలెత్తుకునేలా చేశారని వివరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఇడా చైర్మన్, ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, కార్పొరేటర్లు పిల్లంగోళ్ల శ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, తుమరాడ స్రవంతి, అర్జి సత్యవతి, కిలాడి జ్యోతి, పార్టీ క్లస్టర్-1 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్, పార్టీ నగర యువజన అధ్యక్షులు నిడికొండ నరేంద్ర, నగర బీసీ విభాగ అధ్యక్షులు లక్కోజు రాజగోపాలచారి, తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు నియోజకవర్గంలో 25, 26, 31, 32 డివిజన్లలో మంగళవారం ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు ఆధ్వర్యంలో ఆయా డివిజన్లల్లో సమావేశాలు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో అత్యంత నాణ్యమైన ఉత్తమమైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్నమైన విధానాలకు శ్రీకారం చుట్టారని వివరించారు. ప్రతి వ్యక్తికీ ప్రపంచ స్థాయి విద్యతో పాటు అత్యాధునిక వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో అనేక మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజల చిరకాల కోరిక మెడికల్ కళాశాలను తీసుకొచ్చామని, ప్రతి ప్రాంతంలోనూ డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్, విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి రెండు వేల మంది ప్రజలకు సమీపంలోనే ప్రభుత్వ సేవలందించేందుకు వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతర్లంక లక్ష్మణరావు, బండారు సునీత, గునిపూడి శ్రీనివాసరావు, అద్దంకి హరిబాబు, పార్టీ నాయకులు ఉన్నారు.

గవర్నర్ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు పురస్కారాలు అందించిన నరేంద్ర పాటిల్

ఏలూరు (టూటౌన్): గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏలూరు రైల్వే స్టేషన్‌కు విచ్చేసిన సందర్భంగా శర్వాణి విద్యార్థులకు అరుదైన అవకాశం దక్కిందని హెచ్ఎం సత్యశారద అన్నారు. దేశంలోని రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాలకు ప్రధాని వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారని తెలిపారు. ఇందులో భాగంగా ఏలూరులో నిర్వహించిన కార్యక్రమానికి గవర్నర్ విచ్చేశారని, స్వాగత నమఃస్సుమాంజలి అందించేందుకు శర్వాణి చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచినట్టు చెప్పారు. వికసిత భారత్ - వికసిత్ రైల్వేస్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో తమ విద్యార్థులు పవన్‌కుమార్ (10వ తరగతి) ప్రథమ, బి.హేమవల్లి (9వ తరగతి) ద్వితీయ, యు.తేజశ్రీకి (9వ తరగతి) తృతీయ స్థానాల్లో నిలిచారని, వకృత్వంలో టి.హాస్యసుమ, జె.భువన పద్మశ్రీ, ఎస్ ప్రతిమ వరుసగా మూడు స్థానాలు సాధించారని వివరించారు. విజేతలను విజయవాడ రైల్వే డివిజన్ మేనేజర్ నరేంద్ర పాటిల్ చేతులు ప్రశంసా పత్రం, మెమెంటో, పతకాలు అందించారని తెలిపారు. చిన్నారులను పాఠశాల డైరెక్టర్ మదన్ మోహన్ రాజు అభినందించారు.

పేదల సొంతింటి కల సాకారం



6వ డివిజన్‌లో ఇళ్ల పత్రాలు అందుకున్న లబ్ధిదారులు



47వ డివిజన్‌లో ఇంటి పత్రాలు అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ చిరంజీవులు

ఏలూరు టౌన్: పేదవర్గాల ప్రజలకు గూడు కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందిస్తే.. ఏలూరు నియోజకవర్గం ఏలూరులో ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆధ్వర్యంలో 30 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించడం విశేషం. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి పూర్తి హక్కు కల్పిస్తూ పత్రాలను అందించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏలూరు నగరంలో ఆయా డివిజన్లల్లో మంగళవారం రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, నాయకులు అందజేశారు. 47వ డివిజన్ ఇజ్రాయేల్‌పేటలో ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్ చేతులు మీదుగా ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు స్థానిక సచివాలయంలో అందజేశారు. 6వ డివిజన్‌లో మాదేపల్లి ఇందిరమ్మ కాలనీ సచివాలయం-1లో జగనన్న ఇళ్ల స్థలం హక్కు పత్రాలను లబ్ధిదారులకు క్లస్టర్-1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ అందించారు. సుమారు 72 మందికి తాజాగా హక్కు పత్రాలు అందించారు. 46వ డివిజన్ 19వ సచివాలయంలో 46వ డివిజన్ కార్పొరేటర్ అయేషా సుల్తానా ఆధ్వర్యంలో పార్టీ ముస్లిం మైనార్టీ నగర అధ్యక్షుడు రియాజ్ అలీఖాన్ చేతులు మీదుగా 364 మందికి ఇళ్ల స్థల హక్కు పత్రాలను అందించారు. ఏలూరు 16వ డివిజన్ 42వ సచివాలయంలో 16వ డివిజన్ కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు జిజ్జువరపు రమేష్ చేతులు మీదుగా లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలకు సంబంధించి శాశ్వత హక్కు కలిస్తూ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ ఏలూరు నగరంలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని తెలిపారు. దివంగత వైఎస్సార్ హయాంలోనూ ఏలూరులో 11 వేలకుపైగా పేదలకు ఇళ్ల పట్టాలు అందించారని, నేడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో 30 వేల ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం విశేషమన్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో పేదల అభివృద్ధి



ఇళ్ల స్థల పట్టాలు అందుకున్న మహిళలు

ఏలూరు రూరల్: వైఎస్సార్ సీపీ పాలనలో పేదలు ఆర్థికంగా బలోపేతమయ్యారని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. మంగళవారం ఏలూరు 15 డివిజన్ పరిధిలో సుమారు 200 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల ప్రజలను అన్ని విధాలుగా ఆదుకున్నారని వివరించారు. రూ.కోట్లు ఖర్చుపెసి పేదల సొంతింటి కల నెరవేర్చారని చెప్పారు. జగనన్నకాలనీ నిర్మాణాలపై పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని వివరించారు. ఏలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని సుమారు 30 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం విశేషమన్నారు. మరో 20 ఏళ్ల వరకు ఏలూరు నగరంలో ఇల్లు లేని పేదవాడు ఉండడని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తామంటున్నారని చెప్పారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న బాధితులకు వైద్య చికిత్సల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నిధులు అందిస్తూ ఆదుకుంటున్నామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఏలూరు నగరంలోని పలువురు బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.7.70 లక్షల నిధులను ఆయన చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం ద్వారా పేదలకు ఆధునిక వైద్య చికిత్సలు, సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఏలూరు నియోజకవర్గంలో 8 మంది బాధిత కుటుంబాలకు వైద్య సేవలకు గానూ నిధులు మంజూరు చేశామని వివరించారు. కార్యక్రమాల్లో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు దిరిశాల వరప్రసాద్, పార్టీ నాయకులు ఉన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు నాణ్యమైన వైద్యం



అర్ధవరంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: పేద ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా అందించాలన్న ఏకైక లక్ష్యంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము అన్నారు. మంగళవారం గణపవరం మండలం అర్ధవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రతి సచివాలయం పరిధిలోని ప్రజలందరి ఆరోగ్య వివరాలు నమోదు చేసి, అవసరమైన వారికి సంబంధిత వైద్య నిపుణులతో ఉచిత వైద్యసేవలు, మందులు అందిస్తారని అన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన వైద్య సిబ్బంది, శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. సర్పంచ్ గాతల సుజాత, ఎంపీటీసీ సభ్యుడు సుభాష్, వైద్యాధికారి పులపర్తి సంతోష్, సీహెచ్‌వో జాలాది విల్సన్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



రామయ్యకోనేరు చెరువు ఆధునికీకరణకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: ఏలూరులో అన్ని ప్రాంతాల అభివృద్ధితో పాటు నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ.88 లక్షలతో నగరంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాని మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రతి ప్రాంతాన్ని ఇడా నిధులతో అభివృద్ధి చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. చొదిమెళ్లలో బ్రాహ్మణ కోనేరు చెరువు అభివృద్ధికి రూ.30 లక్షలు, ఇడా నిధులు, 49వ డివిజన్ జంగారెడ్డిగూడెం రోడ్డులో రామయ్యకోనేరు చెరువు ఆధునికీకరణకు రూ.40 లక్షలు, 49వ డివిజన్ యాదవ నగర్ తంగెళ్లమూడి శివాలయం ప్రాంతంలో బోరు ఏర్పాటుకు రూ.3.30 లక్షలు, 48వ డివిజన్ శివగోపాలపురం శివాలయం చెరువు అభివృద్ధికి రూ.15 లక్షలు ఇడా నిధులతో అభివృద్ధి, సుందరీకరణకు ఎమ్మెల్యే నాని శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు నున్నా స్వాతి శ్రీదేవి, కార్పొరేటర్లు బత్తిన విజయ్‌కుమార్, దేవరకొండ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ క్లస్టర్-1,-3 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్, మంచెం మైబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మహర్దశ

- పీఎం ఉషా పథకంలో రూ.5 కోట్లు మంజూరు
- ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు వెల్లడి



ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు

ఉంగుటూరు: నారాయణపురం ఎస్ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పీఎం ఉషశ్రీ పథకంలో రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ నిధులు కళాశాల అభివృద్ధికి మంజూరు కావడం చాలా ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్‌తోపాటు పాలకవర్గం, అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.1.70 కోట్లు వ్యయంతో ఇండోర్ స్టేడియం, రూ.1.20 కోట్లతో బాలికల వసతి గృహం, రూ.1.10కోట్లు వ్యయంతో అదనపు గదులు, రూ.0.98 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టను న్నట్టు వివరించారు. పూర్వ విద్యార్థులు, అభివృద్ధి కమిటీ కలిసి చేస్తున్న అభివృద్ధికి తోడుగా ఈ నిధులు మరింత ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ వివరించారు. నిధుల మంజూరుకు సహకరించిన ఉన్నత విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్ పోలాభాస్కర్‌కి ఇతర అధికార్లకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో 19 కళాశాలలకు నిధులు మంజూరయ్యాయని, అందులో జిల్లాలో నారాయణపురం కాలేజీ ఉండటం గర్వించే విషయమన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	26
ఏలూరు - తిరుపతి	16.00	4830	28

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే

పెదవేగి : అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగించి చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం బాపిరాజుగూడెంకు విచ్చేసిన ఎమ్మెల్యేకు అక్కచెల్లెమ్మలు ఘన స్వాగతం పలికారు. పెదవేగి మండలానికి సంబంధించి విజయరాయి, కొప్పాక సొసైటీలకు చెందిన గ్రామాల్లోని 3,112 అక్క చెల్లెమ్మలకు వైఎస్సార్ చేయూత 4వ విడత రూ.5,83,50,000 చెక్కును అందజేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ దెందులూరులో మొదటి విడతగా సుమారు 17,000 అక్కాచెల్లెమ్మలకు సొంతింటి కలను నెరవేర్చామని పేర్కొన్నారు. రూ.18 కోట్లతో బలివే వంతెన, విజయరాయిలో అతి పెద్ద రెండవ ప్రభుత్వాసుపత్రి ఇలా అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని అబ్బయ్యచౌదరి చెప్పారు. రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఘన విజయం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, సొసైటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

పెదపాడు: ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నట్లు ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు మండలంలోని తోటగూడెం గ్రామంలో జేజెఎం జలజీవన్ మిషన్ నిధులు రూ.35.60 లక్షలతో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నిర్మాణం, పైపులైన్ ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన చేసారు. ఈకార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా 3నెలల్లో ట్యాంకు నిర్మాణం పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేదుకు వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు, ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు, విజిలెన్స్ మెనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, మాజీ సర్పంచ్ గరికపాటి పాండురంగారావు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పీఎస్ఆర్‌వీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.